# కోల్‌కతా ఘటన భయానకం

- హత్యాచారం ఘటనపై రాష్ట్రపతి ముర్ము ఆవేదన
- మహిళలపై నేరాలపై ఇప్పటికైనా దేశం మేల్కొనాలని సూచన



న్యూఢిల్లీ, ఆగస్టు 28: కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటన తీవ్ర భయానకమైనదని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. ఈ ఘటన పట్ల తనతో పాటు దేశం ఆగ్రహంగా ఉందన్నారు. ఇప్పటివరకు జరిగింది చాలని, మహిళలపై జరిగే నేరాలపై దేశం మేల్కొనాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. కోల్‌కతా ఘటనపై బుధవారం 'పీటీఐ'కి రాసిన వ్యాసంలో తన అభిప్రాయాలను వ్యక్తపరిచారు. కోల్‌కతాలో విద్యార్థులు, వైద్యులు, ప్రజలు నిరసనలు తెలియజేస్తుంటే, నేరస్థులు వేరే చోట్ల సంచరిస్తూనే ఉన్నారని, బాధితుల్లో కేజీ చదివే చిన్నారులూ ఉన్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. 'భవిష్యత్తులో నిర్భయ తరహా ఘటన పునరావృతం కాదని హామీ ఇవ్వగలరా?' అని ఇటీవల రక్షాబంధన్ సందర్భంగా తనను కలిసిన స్కూల్ పిల్లలు అమాయకంగా అడిగారని ఆమె గుర్తు చేసుకున్నారు. మహిళలపై నేరాల వక్రబుద్ధి పట్ల దేశం మేల్కొనాలని, మహిళలు తక్కువ శక్తివంతులని, తక్కువ సమర్థులని, తక్కువ జ్ఞానం కలిగిన వారనే ఆలోచనావిధానాన్ని ఎదుర్కోవాల్సిన సమయం ఆసన్నమైందని బుధవారం ఆమె పేర్కొన్నారు. ఇటువంటి ఆలోచనలు ఉన్న వారు స్త్రీని ఒక వస్తువుగా చూస్తారని అన్నారు. భయం నుంచి స్వేచ్ఛను పొందే మార్గంలో మన ఆడబిడ్డలకు అడ్డంకులు తొలగించేందుకు కట్టుబడి ఉండాలని పేర్కొన్నారు.

**నిర్భయంగా నిజం వైపు నిలవండి**

మీడియా నిర్భయంగా పని చేయాలని, నిజం వైపు నిలబడాలని ద్రౌపది ముర్ము పేర్కొన్నారు. పీటీఐ 77వ వార్షికోత్సవాన్ని ఉద్దేశించి ఆమె తన సందేశాన్ని ఇచ్చారు. మీడియా ఎప్పుడూ గౌరవం పోగొట్టుకోవద్దని, ప్రజల విశ్వాసాన్ని గెలుచుకోవాలని పేర్కొన్నారు.

# రాత్రిపూట పెట్రోలింగ్ చేపట్టాలి

***దవాఖానల్లో సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించాలి***

**వైద్యుల భద్రతపై రాష్ట్రాలకు కేంద్రం సూచనలు**

న్యూఢిల్లీ: దవాఖానల్లో వైద్యుల భద్రత, వారిపై దాడులు, హింసను నియంత్రించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కేంద్ర ప్రభుత్వం బుధవారం రాష్ట్రాలకు పలు సూచనలు చేసింది. లోపాలను గుర్తించి, తగిన చర్యలు తీసుకొనేందుకు జిల్లా దవాఖానల్లో సెక్యూరిటీ ఆడిట్ నిర్వహించాలని, రాత్రి సమయాల్లో పెట్రోలింగ్ చేపట్టాలని, పెద్ద దవాఖానల వద్ద నియంత్రిత యాక్సెస్ ఉండాలని పేర్కొన్నది. కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్‌పై హత్యాచార ఘటనపై సుప్రీంకోర్టు సుమోటో విచారణ చేపట్టిన నేపథ్యంలో కేంద్రం ఈ మేరకు మార్గదర్శకాలు విడుదల చేసింది. వైద్యుల భద్రతకు సంబంధించి తాము నియమించిన నేషనల్ టాస్క్ ఫోర్స్(ఎన్‌టీఎఫ్) ప్రొటోకాల్‌ను రూపొందించేంత వరకు విధి నిర్వహణ సమయంలో భద్రతపై వైద్యుల ఆందోళనలను పరిష్కరించేందుకు రాష్ట్రాల్లో తగిన చర్యలు ఉండేలా చూడాలని న్యాయస్థానం కేంద్ర ఆరోగ్య శాఖను ఆదేశించింది. ఈ నేపథ్యంలో కేంద్ర క్యాబినెట్ కార్యదర్శి నేతృత్వంలో ఎన్‌టీఎఫ్ మంగళవారం తొలి భేటీ జరిగింది. బుధవారం జరిగిన వర్చువల్ సమావేశానికి కేంద్ర హోం, ఆరోగ్య శాఖ కార్యదర్శులతోపాటు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, డీజీపీలు, కేంద్ర ప్రభుత్వ అధికారులు హాజరయ్యారు. డాక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది భద్రతకు సంబంధించి 26 రాష్ట్రాలు/యూటీల్లో ఇప్పటికే చట్టాలు ఉన్నాయని ఈ సందర్భంగా అధికారులు వెల్లడించారు. ఇతర రాష్ట్రాలు కూడా అలాంటి చట్టాలు చేయాలని కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర, కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ కోరినట్టు కేంద్రం విడుదల చేసిన ఓ ప్రకటన పేర్కొన్నది. బ్లైండ్ స్పాట్‌ల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, వైద్య సిబ్బంది కోసం 112 హెల్ప్‌లైన్ నంబర్‌ను ఏకీకృతం చేయాలని రాష్ట్రాల అధికారులను మోహన్ కోరారు. ఇంకేమైనా కొత్త ఆలోచనలతో ముందుకు రావాలని అపూర్వ చంద్ర రాష్ట్రాలకు సూచించారు. హాస్పిటల్స్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని, రెగ్యులర్‌గా సెక్యూరిటీ, ఫైర్ డ్రిల్స్ నిర్వహించాలన్నారు.



దల్జీత్ సింగ్ | రజ్వీందర్

## సీఐఎస్ఎఫ్, బీఎస్ఎఫ్‌కు కొత్త చీఫ్‌లు

న్యూఢిల్లీ: కేంద్ర పారిశ్రామిక భద్రత దళం (సీఐఎస్ఎఫ్) డైరెక్టర్ జనరల్‌గా రజ్వీందర్ సింగ్ భట్టి, సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) చీఫ్‌గా దల్జీత్ సింగ్ చౌదరి నియమితులయ్యారు. సిబ్బంది వ్యవహారాల శాఖ బుధవారం ఈ మేరకు ఆదేశాలను జారీ చేసింది. భట్టి 1990 బ్యాచ్ బీహార్ క్యాడర్ ఐపీఎస్ అధికారి. ఆయన వచ్చే ఏడాది సెప్టెంబరు 30 వరకు పదవిలో కొనసాగుతారు. చౌదరి 1990 బ్యాచ్ యూపీ క్యాడర్ ఐపీఎస్ అధికారి. ఆయన వచ్చే ఏడాది నవంబరు 30 వరకు బీఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్‌గా కొనసాగుతారు.

# ఉరికొయ్యకు విద్యార్థులు!

- దేశంలో మొత్తం ఆత్మహత్యల కంటే రెట్టింపు పెరుగుదల రేటు
- జనాభా వృద్ధిరేటు కంటే ఎక్కువే
- ఐసీ3 ఇన్‌స్టిట్యూట్ నివేదిక

న్యూఢిల్లీ: పలు కారణాలతో దేశంలో ఆత్మహత్యలు చేసుకొంటున్న విద్యార్థుల సంఖ్య ఆందోళనకర స్థాయిలో పెరుగుతున్నది. జనాభా పెరుగుదల రేటు, దేశవ్యాప్తంగా మొత్తం ఆత్మహత్యల రేటును కూడా ఇది దాటేస్తున్నదని జాతీయ నేర గణాంకాల సంస్థ డాటా ఆధారంగా ఐసీ3 ఇన్‌స్టిట్యూట్ బుధవారం విడుదల చేసిన నివేదిక వెల్లడించింది. ఏడాదికి దేశంలో మొత్తం బలవన్మరణాలు 2 శాతం పెరగ్గా, విద్యార్థుల ఆత్మహత్యలు ఆందోళనకరంగా 4 శాతం మేర పెరిగాయి. నమోదు కాని విద్యార్థుల ఆత్మహత్యలు ఉండే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇది మరింత ఎక్కువగా ఉంటుందని నివేదిక తెలిపింది.

- విద్యార్థుల ఆత్మహత్యల వార్షిక పెరుగుదల రేటు 4%
- మొత్తం ఆత్మహత్యల పెరుగుదల 2%

**విద్యార్థుల బలవన్మరణాలు ఏ రాష్ట్రాల్లో ఎక్కువ?**

1.మహారాష్ట్ర, 2.తమిళనాడు 3.మధ్యప్రదేశ్
(ఈ 3 రాష్ట్రాల్లోనే 1/3 వంతు)

- దక్షిణాది రాష్ట్రాలు, యూటీల్లో కలిపి-29%

## ప్రభుత్వ పథకాలను ప్రచారం చేస్తే నెలకు రూ. 8 లక్షల సంపాదన

**ఇన్‌ఫ్లుయెన్సర్లకు యూపీ ప్రభుత్వం ఆఫర్**

లక్నో: ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలు, విజయాలకు ప్రచారం కల్పించేందుకు సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను యూపీ సర్కారు రంగంలోకి దించనుంది. ఈ మేరకు నూతన సోషల్‌మీడియా పాలసీని రూపొందించింది. దీని ప్రకారం.. ప్రభుత్వ పథకాలకు ప్రచారం కల్పించడం ద్వారా ఇన్‌ఫ్లుయెన్సర్లు నెలకు రూ.8 లక్షల వరకు ఆర్జించవచ్చు. దీనిపై ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. త్వరలో జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ సర్కారుకు ఓటమి తప్పదని, దీన్నుంచి ఏ సోషల్‌మీడియా వారియర్ కూడా రక్షించలేరని స్పష్టంచేశాయి. మరోవైపు, సోషల్‌మీడియాలో దేశ వ్యతిరేక పోస్ట్‌లు పెట్టేవారికి మూడేళ్ల జైలు శిక్ష నుంచి జీవిత ఖైదు వరకు శిక్ష విధించేలా నూతన పాలసీలో నిబంధనలు పొందుపరిచారు.

# బెంగాల్ తగలబడితే | ఢిల్లీనూ తగలబడుతుంది!

- అస్సాం, ఒడిశా, జార్ఖండ్, బీహార్ సైతం..
- బెంగాల్ సీఎం మమతా బెనర్జీ వ్యాఖ్యలు
- కోల్‌కతా ఘటనపై 16 రోజులుగా సీబీఐ దర్యాప్తు చేస్తున్నా న్యాయం ఎక్కడని ప్రశ్న

కోల్‌కతా, ఆగస్టు 28: 'బెంగాల్ తగలబడితే, తర్వాత అస్సాం, బీహార్, జార్ఖండ్, ఒడిశా, ఢిల్లీ కూడా తగలబడతాయి అనే విషయం గుర్తుంచుకోండి' అంటూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ వ్యాఖ్యానించారు. పశ్చిమ బెంగాల్‌లో తాజా ఘటనలను ఉద్దేశించి బుధవారం కోల్‌కతాలో తృణమూల్ విద్యార్థి విభాగం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. మమత వ్యాఖ్యలపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ తీవ్రంగా స్పందించారు. 'దీదీ, అస్సాంను బెదిరించేందుకు ఎంత ధైర్యం? మాపై కళ్లు ఎర్రవి చేసి చూడకండి. మీ విఫల రాజకీయాలతో దేశాన్ని తగలబెట్టేందుకు ప్రయత్నించకండి' అంటూ 'ఎక్స్'లో పేర్కొన్నారు. రాజ్యాంగ పదవిలో ఉండి మమతా బెనర్జీ దేశ వ్యతిరేక వ్యాఖ్యలు చేశారని, ఆమెపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు బీజేపీ పశ్చిమ బెంగాల్ అధ్యక్షుడు సుకాంత మజందార్ లేఖ రాశారు. 'నేను ఎప్పుడూ ప్రతీకారాన్ని కోరుకోలేదు. కానీ ఇప్పుడు ఏది అవసరమైతే అది చేయండి' అని అమిత్ షాను కోరారు.

**రేపిస్టులకు ఉరిశిక్ష పడేలా చట్టాల సవరణ: మమత**

అత్యాచార ఘటనలను తమ ప్రభుత్వం ఏమాత్రం ఉపేక్షించబోదని, రేపిస్టులకు ఉరిశిక్ష పడేలా ప్రస్తుతం ఉన్న చట్టాలను సవరిస్తామని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు. వచ్చే వారమే అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెడతామని, దీనిని గవర్నర్ ఆమోదించకపోతే రాజ్‌భవన్ ముందు తానే ధర్నాకు దిగుతానని తెలిపారు. ఆందోళన చేస్తున్న జూనియర్ డాక్టర్లు తిరిగి విధుల్లో చేరాలని ఆమె కోరారు. హత్యాచార ఘటనలో సీబీఐ విచారణ చేపట్టి 16 రోజులు గడుస్తున్నప్పటికీ న్యాయం ఎక్కడ జరిగిందని ఆమె ప్రశ్నించారు.



టీఎంసీ ఛాత్ర పరిషద్ వ్యవస్థాపక దినోత్సవంలో మాట్లాడుతున్న మమతా బెనర్జీ

**ఉద్రిక్తంగా బెంగాల్ బంద్**

విద్యార్థులపై పోలీసుల చర్యలకు నిరసనగా బీజేపీ పిలుపునిచ్చిన 12 గంటల బెంగాల్ బంద్ బుధవారం ఉద్రిక్తతలతో ముగిసింది. దుకాణాలు, రోడ్లను మూసేందుకు ప్రయత్నించిన బీజేపీ శ్రేణులను పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. పలు రైల్వే స్టేషన్లలో బీజేపీ కార్యకర్తలు రైళ్లను అడ్డుకున్నారు. అక్కడక్కడ బీజేపీ కార్యకర్తలు, తృణమూల్ కార్యకర్తల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్నాయి. మాజీ ఎంపీలు రూపా గంగూలీ, లాకెట్ ఛటర్జీ, రాజ్యసభ ఎంపీ సామిక్ భట్టాచార్య తదితర బీజేపీ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

### డాక్టర్ సందీప్ ఘోష్ ఐఎంఏ సభ్యత్వం సస్పెన్షన్

న్యూఢిల్లీ: కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ మెడికల్ కాలేజ్, హాస్పిటల్ మాజీ ప్రిన్సిపల్ డాక్టర్ సందీప్ ఘోష్ సభ్యత్వాన్ని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) బుధవారం సస్పెండ్ చేసింది. జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్య కేసులో సీబీఐ దర్యాప్తు నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. ఘోష్ ఐఎంఏ కోల్‌కతా శాఖ ఉపాధ్యక్షుడు కూడా. ఐఎంఏ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ అశోకన్ ఏర్పాటు చేసిన కమిటీ ఈ హత్యాచారం, అనంతర పరిణామాలను తనంతట తాను పరిశీలించిందని ఘోష్‌కు పంపిన ఐఎంఏ ఆర్డర్ పేర్కొంది. కొన్ని వైద్యుల సంఘాలు కూడా ఘోష్‌ను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేసినట్లు పేర్కొంది. దీంతో ఐఎంఏ క్రమశిక్షణ సంఘం ఏకగ్రీవంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేసింది.

## నన్ను అనర్హురాలిగా ప్రకటించే అధికారం యూపీఎస్సీకి లేదు

**ఆరోపణలు ఖండించిన ఖేద్కర్**

ముంబై (నమస్తే తెలంగాణ): ఒకసారి ప్రొబేషనర్‌గా ఎంపికై, నియమించిన తర్వాత తన అభ్యర్థిత్వాన్ని తొలగించే అధికారం యూపీఎస్సీకి లేదని మాజీ ఐఏఎస్ ట్రైనీ అధికారిణి పూజా ఖేద్కర్ వాదించారు. తనపై ఢిల్లీ హైకోర్టులో యూపీఎస్సీ దాఖలు చేసిన కేసుపై ఆమె ఈ విధంగా స్పందించారు. 'అఖిల భారత సర్వీసుల చట్టం-1954, సీఎస్ఈ 2022 నిబంధనల్లోని ప్రొబేషనర్ రూల్స్ నెం.19 ప్రకారం డీఓపీటీ(వ్యక్తిగత, శిక్షణ విభాగం) మాత్రమే చర్యలు తీసుకోవచ్చు' అని ఆమె తెలిపారు. యూపీఎస్సీకి తన పేరును తప్పుగా లేదా మోసం చేసే విధంగా చెప్పలేదని ఆమె పేర్కొన్నారు.

## డీఎంకే ఎంపీకి 908 కోట్ల జరిమానా

**ఫెమా కేసులో ఈడీ నోటీసు**

చెన్నై: డీఎంకే ఎంపీ ఎస్ జగద్రక్షకన్, ఆయన కుటుంబ సభ్యులకు ఈడీ రూ.908 కోట్ల జరిమానా విధించింది. విదేశీ మారక ద్రవ్య నిర్వహణ చట్టం (ఫెమా) నిబంధనల ఉల్లంఘన ఆరోపణలపై 2020 సెప్టెంబరులో దర్యాప్తు నిర్వహించినట్లు ఈడీ నోటిఫికేషన్ తెలిపింది. జగద్రక్షకన్, ఆయన కుటుంబ సభ్యుల పేరు మీద ఉన్న రూ.89.19 కోట్ల విలువైన ఆస్తులను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది. వీరు విదేశీ సంస్థల్లో అక్రమంగా పెట్టుబడులు పెట్టారని ఆరోపిస్తూ 2021 డిసెంబరులో ఈడీ ఫిర్యాదును దాఖలు చేసింది. జగద్రక్షకన్ 2017లో సింగపూర్‌లోని ఓ బూటకపు కంపెనీలో రూ.42 కోట్ల మేరకు పెట్టుబడి పెట్టారని ఆరోపించింది.

## 72 దరఖాస్తులు క్యూలో ఉన్నా..

- ఖర్గే కుటుంబ ట్రస్టుకు అక్రమంగా భూకేటాయింపు
- కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రతిపక్ష బీజేపీ విమర్శలు

న్యూఢిల్లీ: కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అవినీతి పెచ్చరిల్లిపోయిందని, ఒక్కొక్కటిగా అక్రమాల వ్యవహారాలు బయటకొస్తున్నాయని బీజేపీ ఆరోపించింది. ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గే కుటుంబానికి చెందిన ట్రస్టుకు ప్రభుత్వం అక్రమంగా భూ కేటాయింపు చేసిందని పేర్కొన్నది. బీజేపీ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది బుధవారం మీడియాతో మాట్లాడుతూ వేలం నిర్వహించకుండా భూ కేటాయింపు జరిగిందని ఆరోపించారు. 'కొంత భూమి కేటాయించాలని సాంఘిక న్యాయం, సంక్షేమ విభాగం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఈ ఏడాది ఫిబ్రవరి 14న కోరినా కేటాయించలేదు. 72 దరఖాస్తులు క్యూలో ఉన్నప్పటికీ ఖర్గే కుటుంబానికి భూమి కేటాయించారు' అని ఆయన ఆరోపించారు. ఈ-వేలం ఎందుకు నిర్వహించలేదని ప్రశ్నించారు.

# డీకే తెరచాటు రాజకీయం!

- కర్ణాటక డిప్యూటీ ముఖ్యమంత్రి శివకుమార్‌తో బీజేపీ ఎమ్మెల్సీ ఏహెచ్ విశ్వనాథ్ భేటీ
- ఇటీవల ముడా స్కామ్‌ను బయటపెట్టిన వ్యక్తితో డీకే సమావేశమవడంపై చర్చ



బెంగళూరు: కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ముడా స్కామ్ ఆరోపణల్లో చిక్కుకున్న వేళ.. డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌తో బీజేపీ ఎమ్మెల్సీ ఏహెచ్ విశ్వనాథ్ మంగళవారం భేటీ కావడం చర్చనీయాంశంగా మారింది. మైసూర్‌లో సిద్ధరామయ్య భార్యకు అక్రమంగా భూములు కేటాయించారన్న ఆరోపణల అంశం గతకొద్ది కాలంగా రాష్ట్ర రాజకీయాలను కుదిపేస్తున్న విషయం తెలిసిందే. వాల్మీకి స్కామ్, పలు ఇతర అంశాలతో పాటు ఈ వ్యవహారం సీఎం సిద్ధరామయ్య కుర్చీకి ఎసరు పెట్టే అవకాశం ఉందని, ఇదే జరిగితే ఈసారి ఎలాగైనా సీఎం పీఠం దక్కించుకొనేందుకు డీకే శివకుమార్ విశ్వప్రయత్నాలు చేస్తున్నారన్న చర్చ కూడా నడుస్తున్నది. ఇలాంటి సమయంలో ముడా అంశంపై రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరును తీవ్రంగా విమర్శించడంతోపాటు ముడా స్కామ్‌పై ఇటీవల మీడియాతో మాట్లాడిన విశ్వనాథ్ డీకేతో భేటీ కావడం వెనుక ఉద్దేశాలు, రాజకీయ ఎత్తుగడలపై ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి.

**సిద్ధరామయ్యపై విశ్వనాథ్ అసంతృప్తి!**

సిద్ధరామయ్యపై ఎమ్మెల్సీ విశ్వనాథ్‌కు తీవ్ర అసంతృప్తి ఉన్నది. విశ్వనాథ్ కూడా కురుబ సామాజికవర్గానికి చెందిన వ్యక్తే. గతంలో కాంగ్రెస్ నుంచి మైసూర్ ఎంపీ టికెట్ కోసం ప్రయత్నించారు. ఇందుకు ఆయన సిద్ధరామయ్యతో పలుమార్లు భేటీ అయినా టికెట్ దక్కలేదు. ఇదే విశ్వనాథ్ ముడా స్కామ్ అంశాన్ని బయటపెట్టేందుకు దారితీసిందని విశ్లేషకులు అంటున్నారు. ఇప్పుడు డీకేతో భేటీ కావడం వెనుక ఉద్దేశాలు, తిరిగి కాంగ్రెస్‌లోకి అతని రాకకు సంబంధించి చర్చ ప్రారంభమైంది.

**డీకే వర్గానికి ఊరటగా ముడా స్కాం**

ఇటీవల జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో బెంగళూరు రూరల్ నుంచి డీకే సోదరుడు, బెంగళూరు నార్త్, మైసూర్ స్థానాల్లో పోటీచేసిన వొక్కళిగ కమ్యూనిటీ అభ్యర్థులు ఓటమి పాలవడంతో డిప్యూటీ సీఎంకు ఎదురుదెబ్బ తగిలినట్టు అయింది. దీంతో కేఎన్ రాజన్న వంటి సిద్ధరామయ్య సన్నిహితులు మరికొంత మందికి డిప్యూటీ సీఎం పదవులు ఇవ్వాలనే డిమాండ్‌ను తీసుకురావడం డీకే వర్గానికి ఇబ్బందికరంగా మారింది. ఇలాంటి సమయంలో ముడా స్కామ్ అంశాన్ని విశ్వనాథ్ లేవనెత్తడం డీకేకు ఊరటనిచ్చినట్టు అయిందని పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

**ఆయన వద్ద ఒరిజనల్ పత్రాలు**

శివకుమార్‌తో భేటీకి ఎలాంటి రాజకీయ ప్రాధాన్యం లేదని, గ్రాంట్లు, అభివృద్ధి పనులకు సంబంధించి చర్చించేందుకు వచ్చానని విశ్వనాథ్ చెబుతున్నారు. తన మీటింగ్‌లకు సంబంధించిన ఫొటోలను సోషల్ మీడియాతో పంచుకొనే డీకే.. మంగళవారం విశ్వనాథ్‌తో జరిగిన భేటీ ఫొటోలను షేర్ చేయలేదు. ఈ భేటీలో డీకే, విశ్వనాథ్‌లకు సన్నిహితుడైన మైసూర్ జిల్లా మాజీ ఇన్‌చార్జి మంత్రి ఎస్‌టీ సోమశేఖర్ ఉన్నారనే ప్రచారం కూడా జరుగుతున్నది. ఆయన వద్ద ముడా భూ కేటాయింపులకు సంబంధించి ఒరిజనల్ పత్రాలు ఉన్నాయనే ప్రచారం ఉన్నది.

## భారత్‌లో 19.3% తగ్గిన వాయు కాలుష్యం

**ఏడాది పెరిగిన ప్రజల సగటు ఆయుర్దాయం: నివేదిక వెల్లడి**

న్యూఢిల్లీ, ఆగస్టు 28: దేశంలో వాయు కాలుష్యం 2022లో 19.3 శాతం తగ్గింది. ఆ ఏడాది ప్రపంచంలో బంగ్లాదేశ్ తర్వాత భారత్‌లోనే వాయు కాలుష్యం అధికంగా తగ్గిందని, దీంతో భారతీయుల సగటు ఆయుర్దాయం ఏడాదిపాటు పెరిగిందని షికాగో యూనివర్సిటీలోని ఎనర్జీ పాలసీ ఇన్‌స్టిట్యూట్ (ఎపిక్) తాజాగా విడుదల చేసిన 'ఎయిర్ క్వాలిటీ లైఫ్ ఇండెక్స్-2024' నివేదికలో వెల్లడించింది. 2021తో పోలిస్తే 2022లో భారత్‌లో కాలుష్య రేణువుల (పీఎం 2.5) స్థాయిలు క్యూబిక్ మీటర్‌కు 9 మైక్రో గ్రాములు తగ్గాయని, ముఖ్యంగా బెంగాల్, జార్ఖండ్‌లోని పలు జిల్లాల్లో పీఎం 2.5 స్థాయిలు గణనీయంగా క్యూబిక్ మీటర్‌కు 20 మైక్రో గ్రాముల మేరకు క్షీణించాయని స్పష్టం చేసింది. భారత్‌లో ఇంకా 42 శాతం మంది ప్రజలు జాతీయ ప్రమాణం (క్యూబిక్ మీటర్‌కు 40 మైక్రో గ్రాములు) కంటే పీఎం 2.5 స్థాయి అధికంగా ఉన్న ప్రాంతాల్లోనే నివసిస్తున్నట్టు తెలిపింది.

# అవి సాక్ష్యాలు కానేకావు!

మొదటిపేజీ తరువాయి...

కేసులో కస్టడీలోని నిందితులు ఇచ్చిన నేరారోపణ వాంగ్మూలాలను ఆధారంగా చేసుకొనే బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను అదుపులోకి తీసుకొన్నట్టు ఈడీ, సీబీఐ కోర్టుకు తెలిపింది. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన న్యాయస్థానం.. నిందితులు ఇచ్చిన స్టేట్‌మెంట్లు.. సాక్ష్యాలు, ఆధారాలు ఎలా అవుతాయని నిలదీసింది. విచారణ సరైన పద్ధతిలో జరిగిందా? అంటూ అనుమానాలు వ్యక్తం చేస్తూ.. మంగళవారం కవితకు బెయిల్ మంజూరు చేసింది. కస్టడీలోని నిందితులు ఇచ్చిన వాంగ్మూలాలనే సాక్ష్యాలుగా చేసుకొని 'ఢిల్లీ మద్యం పాలసీ' కేసు దర్యాప్తు జరిగిందని ఈడీ, సీబీఐ వ్యాఖ్యలతో స్పష్టమైంది. నిందితుల వాంగ్మూలాలు చెల్లవంటూ సుప్రీం తాజా వ్యాఖ్యలను బట్టి అర్థమవుతున్నది. వీటన్నింటినీ విశ్లేషిస్తే.. 'ఢిల్లీ మద్యం పాలసీ కేసు' నీరుగారిపోవడం తప్ప మరో మార్గం లేదని న్యాయ నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**అందుకే బెయిల్ మంజూరు**

అక్రమ మైనింగ్ కేసులో అరెస్టయిన ప్రేమ్ ప్రకాశ్.. ఈ వ్యవహారంలో నేరం చేసినట్లు గానీ.. బెయిల్‌పై బయటికొస్తే అతను సాక్షులను ప్రభావితం చేస్తాడన్నట్టు గానీ చెప్పడానికి ప్రాథమిక ఆధారాల్లేవని న్యాయస్థానం అభిప్రాయపడింది. దీంతో అతడికి బెయిల్ మంజూరు చేస్తున్నట్లు వెల్లడించింది.

## వచ్చే నెల 2 వరకు పాస్ పోర్ట్ సేవా పోర్టల్ సేవల నిలిపివేత

న్యూఢిల్లీ: పాస్‌పోర్ట్ సేవా పోర్టల్‌కు నేటి రాత్రి 8 గంటల నుంచి వచ్చే నెల 2న ఉదయం 6 గంటల వరకు టెక్నికల్ మెయింటెనెన్స్ జరుగుతుంది. ఈ సమయంలో దీని సేవలు ప్రజలకు అందుబాటులో ఉండవు. ఈ నెల 30వ తేదీకి షెడ్యూల్ అయిన అన్ని అపాయింట్‌మెంట్లను అధికారులు రద్దు చేశారు. రీషెడ్యూల్డు అపాయింట్‌మెంట్స్‌కు సంబంధించిన వివరాలు దరఖాస్తుదారులకు ఎస్ఎంఎస్ ద్వారా నోటిఫికేషన్‌ను పంపిస్తారు. ఈ సమయంలో ఎంఈఏ/ఆర్‌పీఓ/బీఓఐ/ఐఎస్‌పీ/డీఓపీ/పోలీసు అధికారులకు కూడా ఈ పోర్టల్ సేవలు అందుబాటులో ఉండవు.

## నదిలోకి 50 ఆవుల్ని తోసేసిన ఆకతాయిలు

**20 గోవుల మృత్యువాత**

సాత్నా (మధ్యప్రదేశ్): మధ్యప్రదేశ్‌లోని సాత్నా జిల్లాలో కొందరు ఆకతాయిలు సుమారు 50 గోవుల్ని నదిలోకి తోసేశారు. ఈ ఘటనలో సుమారు 20 ఆవులు చనిపోయినట్టు తెలిసింది. నిందితులు ఆవుల్ని నదిలోకి తోస్తున్న వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నది. మంగళవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు నలుగురు నిందితులపై భారతీయ న్యాయ్ సంహిత (బీఎన్ఎస్) కింద కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం ఆకతాయిలు దాదాపు 50 ఆవులను నదిలోకి తోసేశారు. వీటిలో 20 వరకు చనిపోగా, మిగిలిన వాటి కోసం పోలీసులు గాలిస్తున్నారు.



## దెయ్యాలకు లాంగ్ జంప్ పోటీలు!

- నిర్వహించిన యమ ధర్మరాజు, చిత్రగుప్తుడు
- కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో రోడ్ల దుస్థితిపై వినూత్న నిరసన

ఉడుపి: నరుల ప్రాణాలు హరించే యమ ధర్మరాజు, మానవుల పాపపుణ్యాల చిట్టా రాసిపుంచే చిత్రగుప్తుడు కాంగ్రెస్ పాలనలోని కర్ణాటకలో రోడ్ల పరిస్థితిని చెక్ చేసేందుకు భూమిపైకి వచ్చారు! రహదారుల దుస్థితిని తెలిపేందుకు ఉడుపిలో కొంత మంది వినూత్నంగా నిరసన చేపట్టారు. ప్రాణాంతకంగా తయారైన రోడ్లపై భారీగా ఏర్పడిన గుంతల వద్ద 'దెయ్యాల'కు లాంగ్ జంప్ పోటీలు నిర్వహించారు. ఎంత దూరం దూకారో టేపులు పెట్టి కొలిచారు. ఈ వీడియోపై నెటిజన్లు పలు విధాలుగా స్పందించారు. రోడ్డు నిండా గుంతలు ఉండటంతో కొందరు ఈ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ పోటీలు నిర్వహించారు.



గుజరాత్‌లో భారీ వర్షాల ధాటికి వడోదరలోని ఓ రోడ్డు ఇలా ముక్కలు ముక్కలైంది. 'స్టాట్యూ ఆఫ్ యూనిటీ' వద్దకు వెళ్లే ఈ రోడ్డుపై తారు చాలా భాగం వరకు పెచ్చులుగా లేచిపోయింది. దీంతో ఆ రోడ్డుపై వాహనాల రాకపోకలను నిలిపివేశారు. మరోవైపు గుజరాత్‌లో వర్షం కారణంగా గత మూడు రోజుల వ్యవధిలో 26 మంది మరణించారు.



## ఓం పర్వతంపై మొదటిసారి మంచు మాయం

***వాహన కాలుష్యమే కారణం!***

పితోరాఘడ్: గత వారం ఉత్తరాఖండ్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం ఓం పర్వతంపై మంచు పూర్తిగా మాయం కావడం సందర్శకులను ఆశ్చర్యానికి గురి చేసింది. గత అయిదేండ్లలో హిమాలయాల ఎగువ ప్రాంతంలో కొద్దిపాటి వర్షాలు, కొద్దిగా మంచు కురవడం, వాహన కాలుష్యం పెరుగుదల, భూతాపం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని నిపుణులు తెలిపారు. అయితే సోమవారం రాత్రి ఈ పర్వతంపై మంచు కురిసింది. వ్యాస్ లోయలో 14 వేల అడుగుల ఎత్తులో ఉండే ఓం పర్వతంపై హిందీ పదం 'ఓం' ఆకారంలో సహజంగా మంచు ఏర్పడుతుంది. ఈ కారణంగా ఈ పర్వతానికి ఆ పేరు వచ్చింది. హిమాలయాల్లోని జోలింగ్‌కాంగ్‌ను ప్రధాని గతేడాది అక్టోబర్‌లో సందర్శించిన తర్వాత పర్యాటకుల తాకిడి పది రెట్లు పెరగడం కూడా తాజా పరిస్థితికి కారణమని నిపుణులు వాపోయారు.